

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 135 ఎడిటర్ : జి.రాజేష్ సోమవారం10 ఆగష్టు 2026 పేజీలు : 6 వెల రూ. 4.00



## డీఎస్సీపై వైసీపీవి రాజకీయ డ్రామాలు

టెక్కలి, ఐఎన్‌బిటైమ్స్

డీఎస్సీపై వైసీపీ రాజకీయ డ్రామాలను తిప్పికొట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఆయన మాట్లాడుతూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాన్ని టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ఎండగట్టాలన్నారు. ఐదేళ్లు ప్రజలను

భయపెట్టి పాలించిన గొడ్డలి పార్టీకి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రాజకీయ ముసుగులో గొడ్డలి పార్టీ రౌడీయిజం, అరాచకాలు చేస్తున్న గంజాయి ముఠాలు, బ్లేడు బ్యాచ్‌లను వదిలేయాలా అని ప్రశ్నించారు.

## ప్రతి ఆదివాసీ కుటుంబానికి పక్కా ఇల్లు..

# ప్రతి ఇంటికీ కుళాయి



- ఆదివాసీ గిరులు.. అవకాశాల గనులు
- గిరిజనులు లబ్ధిదారులు కాదు.. అభివృద్ధి భాగస్వాములు
- పాడేరు, అరకు, లంబసింగి.. కశ్మీరు కంటే బాగుంటాయ్
- మన మన్యంలోనూ కుంకుమ పువ్వు, అవకాడో సాగు
- వారి సంక్షేమానికి 4,764 కోట్లు
- వెయ్యి కోట్లతో అడవితల్లికి బాటలు
- డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్స్‌లు
- రాష్ట్రంలో గిరిజనులకు 3 జిల్లాలు,9 ఐటీడీఏలు, కార్పొరేషన్
- వీటన్నిటినీ అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు
- బెజవాడ అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సీఎం ఉద్ఘాటన
- గిరిపుత్రుల అభివృద్ధికి 19 సంస్థలతో ఎంవోయూలు

విజయవాడ, **ఐఎన్‌బిటైమ్స్**గిరిజనులు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కారని.. వారంతా అభివృద్ధి భాగస్వాములని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివాసీ ప్రాంతాలు వెనకబడినవి కావని, అపారమైన అవకాశాలు ఉన్న ప్రదేశాలని తెలిపారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి సీఎం హాజరయ్యారు. ఆయనకు గిరిజన మహిళలు, విద్యార్థులు థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడారు. గిరిజనులు ప్రకృతిని దేవతగా, అడవిని అమ్మగా ఆరాధించి సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటున్నారని కొనియాడారు. వారు స్వచ్ఛమైన మనుషులని.. వారికి చేయూతనిచ్చి, చైతన్యం తీసుకురావాలని పిలుపిచ్చారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజన జనాభా సంక్షేమం కోసం ఈ ఏడాది రూ.4,764 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. 'ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే గిరిజనులను అభివృద్ధిలోకి తీసుకురావడం కష్టం కాదు. గిరిజన ప్రాంతాలకు అనుసంధానం పెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 2,036 గిరిజన ఆవాసాలకు రహదారులను అనుసంధానించాం. ప్రతి ఆదివాసీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మిస్తాం. గిరిజనుల ఇళ్లపై సోలార్ పలకలను ఏర్పాటు చేస్తాం. రూ.1,000 కోట్లతో అడవితల్లికి బాటలు వేస్తున్నాం. 2027 డిసెంబరు నాటికి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్స్‌లు, 108, 104 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. మారుమూల గ్రామాల్లో సెల్‌సిగ్నల్స్ ఉండేలా టెలికమ్యూనికేషన్స్‌తో ఎంవోయూ చేసుకున్నాం. దేశంలో ఎక్కడా గిరిజనుల కోసం మూడు జిల్లాలు లేవు. తొమ్మిది ఐటీడీఏ సెంటర్లు, గిరిజన కార్పొరేషన్ కూడా

మిగతా 2లో


## వైఎస్ హయాంలోనే డీఎస్సీలో అక్రమాలు

- అవినాశ్‌రెడ్డి సమీప బంధువుకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం
- జగన్ అసెంబ్లీలో చర్చకు రావాలి: ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



పులివెందుల,**ఐఎన్‌బిటైమ్స్**కూటమి ప్రభుత్వం నియమ, నిబద్ధతలతో నిర్వహించిన డీఎస్సీ నియామకాలను తప్పు పడుతున్న మాజీ సీఎంజగన్ ఆ అంశంపై అసెంబ్లీలో చర్చకు రావాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. కడప జిల్లా పులివెందులలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువత ఎంతో కష్టపడి డీఎస్సీలో మెరిట్ సాధించి ఉద్యోగాలు సంపాదిస్తే వారిని వైసీపీ నాయకులు తప్పు పడుతున్నారన్నారు. జిల్లాలో ఎంపీ అవినాశ్‌రెడ్డి సమీప బంధువైన ఓ మహిళ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందారని తెలిపారు. మహిళ కాబట్టి తాను పేరు చెప్పడం లేదని, పేరు చెప్పమంటే చెప్పడానికి కూడా సిద్ధమని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగుల నియామకాల్లో

మిగతా 2లో



## నేడు నాగార్జున సాగర్‌లో వరుణయాగం..

హైదరాబాద్,ఐఎన్‌బిటైమ్స్ ఆగస్టు రెండో వారం వచ్చినా సరైన వర్షాలు కురువకపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా, గోదావరి నదుల పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురువాలని కోరుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో వరుణయాగం నిర్వహించనున్నది.108 మంది రుత్వికులు, 11 హోమగుండాలతో ఈ యాగాన్ని నిర్వహిస్తారు. 2:45 గంటలకు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి, అక్కడి నుంచి విజయవిహార్‌కు చేరుకొని పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# నగరవ్యాప్తంగా బోనాల ఉత్సవాలు

- వైభవంగా లాల్‌దర్వాజా బోనాల జాతర
- అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం.. బోనాల సమర్పణ
- నగరవ్యాప్తంగా కిటకిటలాడిన అమ్మవారి దేవాలయాలు



హైదరాబాద్,**ఐఎన్‌బిటైమ్స్**

పలు ఆలయాల్లో కేటీఆర్ ప్రత్యేక పూజలు

లాలాదర్వాజా సింహవాహిని అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ సంతోషంగా ఉండాలని, హైదరాబాద్‌లో వ్యాపారాలు బాగా సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన నగరంలోని పలు ఆలయాలను దర్శించి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నాంపల్లిలోని ఏడుగుళ్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.అక్కడి నుంచి ఓల్డ్ సిటీలోని బంగారు మైసమ్మ, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు.

- మిగతా 2లో పేజిలో

## వరుణ యాగాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్



వరుణ యాగాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పద్మావతి రెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ బి .చంద్రశేఖర్ పాల్గొన్నారు. గోపూజ, విశ్వక్సేన పూజ, యాగశాల ప్రవేశాన్ని రుత్వికులు చేయించారు. ఇవాళ మధ్యాహ్నం మూడు గంటలకు పూర్ణహుతిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు.

INB TIMES
తెలుగు దినపత్రిక Telugu Daily News Paper
సోమవారం 10-8-2026

## వైఎస్ హయాంలోనే డీఎస్సీలో అక్రమాలు

2300 మంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారని, వారిలో చాలా పార్టిసిపేషన్ సర్టిఫికెట్లతో కూడా ఉద్యోగాలు
పొందారని తెలిపారు. 2006లో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో కడప జిల్లాలో డీఎస్సీ పరీక్ష విధానం ఎలా సాగిందో అందరికీ తెలుసని, పరీక్ష పత్రాలను(ఓఎంఆర్) హైదరాబాద్ తరలించే సమయంలో కర్నూలు వద్ద ఆపేసి ఓఎంఆర్ షీట్లను మార్చేశారని, ఆ వ్యవహారం సాగించింది వైఎస్ రక్తసంబంధీకులేనని చెప్పారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో గ్రూప్-1 నియామకాల తీరుపై కోర్టు చీవాట్లు పెట్టిన విషయం అందరికీ తెలుసన్నారు. పరీక్ష పత్రాలను ఒక హోటల్‌కు తరలించి తాడేపల్లె ప్యాలట?సలో ఉన్న వారితో ఇష్టమొచ్చినట్లుగా నాడు మార్కులు ఇచ్చారని ఆరోపించారు. ఈ రెండు కారణాలతో జగన్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇద్దరూ రాజీనామా చేసి ఉండాలని స్పష్టం చేశారు

## నగరవ్యాప్తంగా బోనాల ఉత్సవాలు



లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

అనంతరం మీరాలం శ్రీమహంకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి కేటీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. అటునుంచి అంబర్‌పేట నియోజకవర్గంలోని శ్రీమహంకాళి అమ్మవారి ఆలయం, లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న కనకాల కట్ట మైసమ్మ దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాలను సందర్శించి.. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, తొట్టెల ఊరేగింపు, బాజా బజంత్రీలతో మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకొని అమ్మవార్ల ఆలయాల్లో బోనాలు సమర్పించారు. వేడుకల్లో రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు, సినీ నటులు పాల్గొని సందడి చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి సల్లంగ చూడు తల్లీ అని అమ్మవారిని వేడుకున్నారు.

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- 1,01,384 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



గద్వాల/అయిజ, ఆగస్టు 9 : శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతున్నది. ఆదివారం జూరాల ప్రాజెక్టు నుంచి కేవలం విద్యుదుత్పత్తి ద్వారా 44,279 క్యూసెక్కుల వరద నీరు విడుదల కాగా మొత్తం 1,01,384 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి చేరినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులకుగాను ప్రస్తుతం 878.60 అడుగులు, పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215 టీఎంసీలుకాగా ప్రస్తుతం 181.0590 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఎడమ గట్టు విద్యుత్తు కేంద్రంలో 22,419 క్యూసెక్కులు. కుడిగట్టులో 26,093 క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుత్తు ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి హంద్రీనివాకు 1,611, ఎంజీకేఎల్ఐకి 1,917 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి జూరాల వరద తగ్గిపోవడంతో అధికారులు జూరాల గేట్లను పూర్తి స్థాయిలో మూసి వేశారు. కాగా కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం టీబీ డ్యామ్‌కు 40,500 క్యూసెక్కులు వరద వస్తుండగా, అవుట్ ఫ్లో 1,525 క్యూసెక్కులుగా నమోదైంది. టీబీ డ్యామ్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం1,633 అడుగులకుగాను ప్రస్తుతం 1,624.74 అడుగుల నీటి మట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుతం 75.644 టీఎంసీల నీటి నిల్వ ఉన్నదని డ్యామ్ సెక్షన్ అధికారి కిరణ్ తెలిపారు.

## అమిత్ షా ఎక్కడ?



న్యూఢిల్లీ: గత నెల 20న జంతర్ మంతర్ వద్ద నిరసనకారులపై పోలీసుల అమానుష చర్యపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని విపక్షాలు హోం మంత్రి అమిత్ షాను డిమాండ్ చేస్తున్నాయి. అయితే గత రెండు వారాలుగా ఆయన ఏ సభలోనూ కన్పించకపోవడం ఒక రికార్డుగా మారింది. ఆయన అదృశ్యమయ్యారంటూ పోస్టర్లు వేసినా, నినాదాలు చేసినా అవేమీ ఆయనను సభకు రప్పించలేక పోయాయి. ఓ సభ్యుడు ఫలానా రోజు సభకు హాజరు కావాలని విపక్షాలు డిమాండ్ చేయలేవని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభ్యులు సభలో లొల్లి చేయడానికే పరిమితం కాగా, హోం మంత్రి తన కార్యాలయంలో అర్ధరాత్రి వరకు ఉండి పనిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### ఏదో ఒకరోజు హాజరు?

అమిత్ షా సోమవారం సభకు హాజరవుతారన్న ప్రచారం జరుగుతున్నది. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 13న గురువారం సభ ముగియనున్నందున ఈ ఊహాగానాలు జోరందుకున్నాయి. మొత్తం వర్షాకాల సమావేశాలకు గైర్హాజరయ్యారన్న అపఖ్యాతిని నివారించడానికి ఆయన వచ్చే వారం ఏదో ఒక సభకు హాజరవుతారని భావిస్తున్నారు. డీఎంకే, మరికొన్ని ప్రతిపక్ష పార్టీల మద్దతును పొందగలిగితే హోంమంత్రి ఎఫ్‌సీఆర్ఏ బిల్లు, సవరించిన డీలిమిటేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టవచ్చుననే అంచనాలు పెరుగుతున్నాయి.

# ప్రతి ఆదివాసీ కుటుంబానికి పక్కా ఇల్లు.. ప్రతి ఇంటికీ కుళాయి


ఉన్నాయి. వీటన్నిటినీ అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు' అని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను, కీర్తిని తెలియజేసేలా భోగాపురం విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామన్నారు. థింసా మొన్నటి వరకు నృత్యం మాత్రమేనని.. ఇప్పుడు గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిందని తెలిపారు. గిరిజనులు ఒకప్పుడు పోడు వ్యవసాయం చేసేవారని, ఇప్పుడది ఆగిందన్నారు. ఈ సందర్భంగా గిరిపుత్రుల అభివృద్ధికి 19 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

### గిరిజన విద్యార్థులకు 650 కోట్లు

రాష్ట్రంలో 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. తల్లికి వందనం పథకం కింద వారికి రూ.650 కోట్లు అందజేశాం. ఒకప్పుడు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే వాళ్లంతా కూటమి ప్రభుత్వం వచ్చాక రివర్స్ గేర్‌లో ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఐఐటీ ఆలిండియా పరీక్షలు పెడితే మొదటిసారి 21 మంది గిరిజన విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆ అనుభవంతో విశాఖపట్నం మేకవానిపాలెంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసి 600 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. వారిలో కనీసం 100 మంది విద్యార్థులు ఆలిండియా పరీక్షల్లో ఉత్తీర్ణులై చరిత్ర సృష్టించాలి. ఆదివాసీ విద్యార్థులను ఏఐ వరకు తీసుకెళ్లడానికి చెన్నై ఐఐటీతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. త్వరలోనే గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం చేయిస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉంటున్నవారిలో ఎనీమియా ఎక్కువగా ఉంది. ఈ లోపాన్ని త్వరలో నివారిస్తాం. బాధితులకు రూ.10 వేల పింఛన్ ఇస్తున్నాం. గిరిజన ప్రాంతాల నుంచి ప్రకృతి సహజసిద్ధమైన ఉత్పత్తులకు బెస్ట్ బ్రాండ్‌ను తీసుకొస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బరు, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లానికి ప్రపంచ గుర్తింపు, బ్రాండింగ్ తీసుకొస్తాం. చక్కెర తినే రోజులు పోతున్నాయి. తాటిబెల్లమే కదా అనుకోవద్దు. అది ఆరోగ్యానికి మంచిది. కాఫీ, టీ తాగాలంటే తాటిబెల్లం వేసుకునే రోజులు వస్తాయి. గిరిజనులకు సహకరించే అందరినీ దేశం నలుమూలల నుంచీ రప్పించి ఎంవోయూలు చేసుకున్నాం. మన్యం ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఆదివాసీ ఇల్లు ఓ అతిథి గృహం కావాలి. మన్యంలో సుందర ప్రాంతాలు ఉన్నాయి. పాడేరు, అరకు, లంబసింగి.. కశ్మీరు కంటే బాగుంటాయి. కుంకుమపువ్వు, ఆవకాడో పంటలు కశ్మీరులోనే కాదు.. మన మన్యంలోనూ సాగవుతాయి.

### కాఫీ తోటల సాగు మొదలుపెట్టించా..

పాతికేళ్ల కిందట నేనే కాఫీ తోటల సాగును మొదలు పెట్టించాను. దానికి అరకు కాఫీ అని పేరు పెట్టాం. దానిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి నాంది ఫౌండేషన్ ముందుకొచ్చింది. ప్రధాని మన్‌కీబాత్‌లో అరకు కాఫీ గురించి చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు ఆ దేశ ప్రధానికి అరకు కాఫీ పొడిని బహుమతిగా ఇచ్చారు. నన్ను కలవడానికి వచ్చిన వాళ్లందరికీ ఏమి ఇచ్చినా ఇవ్వకపోయినా.. అరకు కాఫీ మాత్రం కచ్చితంగా ఇస్తాను. దీనిని బెస్ట్ బ్రాండ్‌గా తయారు చేస్తాం. గిరిజన ఉత్పత్తులకు విలువను జోడించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. మైదాన ప్రాంతాల కంటే గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ ఆదాయం రావడం ఆనందదాయకం.



### జగన్ సరిగా స్పందించలేదు..

స్థానిక గిరిజనులకే ఉద్యోగావకాశాలు ఉండాలని నాడు ఎన్టీఆర్ భావించారు. దీనికి నేను 2003లో జీవో నంబర్ 3 జారీచేశాను. 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ జీవోను సుప్రీంకోర్టు కొట్టివేస్తే అప్పుడు సీఎంగా ఉన్న జగన్ సరిగా స్పందించలేదు. ఫలితంగా గిరిజనులు.. ఉన్న హక్కును కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ ఈ సమస్య నా వద్దకు వచ్చింది. దీనిని సరిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రతి మనిషికీ విజన్ ఉండాలి. నేటికీ నేను విద్యార్థినే. కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటా. చంద్రబాబు అను నేను.. మీ జీవితాలను మార్చగలిగితే అదే నాకు ఎనర్జీ.. ఎంతో తృప్తి. 1978లో తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యాను. ఇప్పుడు నాలుగో సారి సీఎంగా ఉన్నాను. ఇప్పటి వరకు గంట సెలవు తీసుకోలేదు. ఆ శక్తే నేను తీసుకునే కొత్తకొత్త విధానాలకు నాంది పలుకుతోంది.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓదార్పు

వరంగల్, ఆగస్టు 9 ఇటీవల అనారోగ్యంతో అకాలమరణం చెందిన ఉద్యమనేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓదార్చారు. అంతకుముందు పెద్ది ఇంటికి చేరుకోగానే ఒక్కసారిగా ఆయన పిల్లలను అకున చేర్చుకొని కేసీఆర్ కన్నీరు పెట్టారు.

పెద్ది కుటుంబసభ్యుల క్షేమం కోసం కేసీఆర్ హృదయం ఎంతగా తల్లడిల్లిందో నల్లబెల్లిలోని పెద్ది నివాసంలో ఆయన నిశ్శబ్దమే సంకేతాత్మకంగా నిలిచింది. పార్టీ ముఖ్య నేతలు అనునయించడంతో కేసీఆర్ కొంత తేరుకున్నారు. దాంతో అకడి వాతావరణం కాస్త తేలిక పడ్డట్టయ్యింది. అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతూ ఇటీవలే అకాల మరణం చెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం ఎర్రవల్లి నివాసం నుంచి బయలుదేరిన కేసీఆర్.. పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి మధ్యాహ్నం చేరుకొన్నారు. ఈ సందర్భంగా 'పెద్ది సుదర్శన్‌రెడ్డి అమర్హే.. జోహార్ పెద్ది సుదర్శన్‌రెడ్డి' అంటూ సాగిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానుల నినాదాల నడుమ పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటం వద్ద కేసీఆర్ నివాళు లర్పించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి భార్య స్వప్న, కొడుకు నిదర్శన్‌రెడ్డి, కూతురు ధర్మిష్ట, తల్లి అమృతమ్మను కేసీఆర్ ఓదార్చారు. పెద్ది అన్నదమ్ములు, కుటుంబసభ్యులను పలుకరించి, పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ పెద్దగా వారికి ధైర్యం చెప్పారు. 'సుదర్శన్‌రెడ్డి భౌతికంగా మన నడుమ లేడని ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందవద్దు. ధైర్యం చెడొద్దు. పెద్దదికుగా నేనున్నా' అని వారందరికీ కేసీఆర్ భరోసా ఇచ్చారు.



కేసీఆర్ ఆర్థికసాయం

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ముందుగా ప్రకటించిన మేరకు పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు.. రూ.ఒక కోటి చొప్పున రూ.2 కోట్ల విలువైన చెక్కులను వారికి అందజేశారు. పెద్ది మాతృమూర్తి అమృతమ్మకు రూ.25 లక్షల చెకును కేసీఆర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి అక సరోజనమ్మ, చెల్లెలు స్వాతి మాలకొండారెడ్డి, పెద్ది సోదరులైన రాయపరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వారి పిల్లలు మహిపాల్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీలత, అనిత, కిరణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అన్విత, ఇతర కుటుంబసభ్యులు ఉన్నారు.

### అధినేత వెంట కదిలిన గులాబీదళం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట బీఆర్ఎస్ ముఖ్య నేతలైన పలువురు నల్లబెల్లికి వచ్చారు. వారిలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో విపక్షనేత మధుసూదనాచారి, శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, శంభీపూర్ రాజు, యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి , కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జీవన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎంపీలు జోగినపల్లి సంతోష్‌కుమార్, బోయినపల్లి వినోద్‌కుమార్, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, గండ్ర వెంకటరమణారెడ్డి, డాక్టర్ రాజయ్య, దాస్యం వినయభాస్కర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, అరూరి రమేశ్, సుంకె రవిశంకర్, శంకర్‌నాయక్, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, వొడితెల సతీశ్, హరిప్రియానాయక్, భూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, వై సతీశ్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, గండ్ర జ్యోతి, బడే నాగజ్యోతి, సుమిత్రానంద్ తనోబా, రజినీ సాయిచంద్ తదితరులు ఉన్నారు.

### పెద్ది కుటుంబానికి పార్టీ అండ

ఆందోళన చెందవద్దని, పార్టీ అండగా ఉంటుందని పెద్ది కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. సుదర్శన్‌రెడ్డి తల్లి అమృతమ్మకు కేసీఆర్ ధైర్యవచనాలు చెప్పారు. భార్య స్వప్నకు గుండెధైర్యాన్నిచ్చారు. పిల్లలను బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు. వారికి తండ్రిలేని లోటు లేకుండా చూసుకోవాలని, పిల్లలను కాపాడు కోవాలని పెద్ది సోదరులకు కేసీఆర్ సూచించారు. పార్టీ స్థాపించిన నాటినుంచీ వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడంలో, పార్టీ నిర్మాణంలో సుదర్శన్‌రెడ్డి పోషించిన పాత్రను, ఆత్మీయుడుగా తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ బాధాతప్త హృదయంతో గుర్తుచేసుకొన్నారు.

## సూపర్ బగ్స్‌కు భారత్ చెక్!

**2 సరికొత్త మందుల ఆవిష్కరణ**
**యాంటీ బయాటిక్ రంగంలో చరిత్రాత్మక విజయం: శాస్త్రవేత్తలు**

న్యూఢిల్లీ: డ్రగ్స్ రెసిస్టెంట్ సూపర్ బగ్స్ ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్న ప్రస్తుత తరుణంలో భారత ఫార్మా రంగం రెండు అరుదైన యాంటీ బయాటిక్ ఆవిష్కరణలను అందించింది. వీటిలో మొదటిది ముంబైకి చెందిన వోక్హార్ట్ నుంచి వచ్చింది. ఇది 'సెఫెపైమ్', 'జిడెబాక్టమ్'ల కొత్త కలయిక అయిన 'జైనిచ్'ను అభివృద్ధి చేసింది. యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మిన్‌స్ట్రేషన్(యూఎస్ ఎఫ్‌డీఏ) తెలిపిన వివరాల ప్రకారం సున్నితమైన బ్యాక్టీరియా వల్ల వచ్చే పైలోనెఫ్రిటిస్ సహా సంక్లిష్టమైన మూత్ర నాళాల ఇన్‌ఫెక్షన్ చికిత్స కోసం జైనిచ్ ఆమోదం పొందింది. ఇక రెండవ ఔషధం ఆర్కిడ్ ఫార్మా నుంచి వచ్చింది. రెసిస్టెంట్ బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా సెఫెపైమ్ ప్రభావాన్ని పునరుద్ధరించడానికి రూపొందించిన మరో సరికొత్త అణువు 'ఎన్మెలాజోబాక్టిమ్'ను ఈ కంపెనీ కనుగొంది. కొన్ని బ్యాక్టీరియాలు యాంటీ బయాటిక్ అణువులను నాశనం చేయడానికి బీటా లాక్టామెస్ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయడం ద్వారా వాటిని ఓడిస్తాయి. ఎన్మెటాజోబాక్టిమ్ ఈ రెసిస్టెన్స్ ఎంజైమ్‌లను నిరోధిస్తుంది.

తద్వారా సెఫెపైమ్ ఇన్‌ఫెక్షన్‌ను అంతం చేయడానికి వీలు కల్పిస్తుంది. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అనేది ప్రపంచ ఆరోగ్యానికి అతిపెద్ద ముప్పుల్లో ఒకటిగా మారుతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పదేపదే హెచ్చరించింది. డబ్ల్యూహెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్‌లు, పరాన్న జీవులు మొదలైనవి మందులకు స్పందించనప్పుడు ఏఎంఆర్ ఏర్పడుతుంది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లకు చికిత్స చేయడం అసాధ్యంగా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా బ్యాక్టీరియల్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ కారణంగా 4.7 మిలియన్లకుపైగా మరణాలు సంభవించవచ్చనే అంచనాలున్నాయి. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ఆరు ప్రయోగశాలల్లో ఒకదానిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌లు యాంటీ బయాటిక్స్‌ను తట్టుకోగలిగే శక్తిని కలిగి ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. ఇదే సందర్భంలో ప్రపంచం యాంటీ మైక్రోబయల్ పరిశోధన, అభివృద్ధి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని తెలిపింది.

## విజయ పాల ధరల పెంపుపై సీపీఎం ఆగ్రహం

విజయవాడ సెంట్రల్,విజయ పాల ధరలను లీటరుకు రెండు రూపాయల చొప్పున పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం లెనిన్ సెంటర్‌లోని విజయ డెయిరీ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హెరిటేజ్ మరియు ఇతర ప్రైవేటు డెయిరీల ప్రయోజనాల కోసం విజయ డెయిరీని బలితీసుకుంటోందని విమర్శించారు. ప్రజలపై వంద కోట్ల భారం గత ఏప్రిల్‌లో లీటరుకు రెండు రూపాయలు పెంచిన డెయిరీ నాలుగు నెలలు గడవక ముందే మళ్లీ ఆగస్టు 10 నుండి మరో రెండు రూపాయలు పెంచడం గర్హనీయమని బాబురావు మండిపడ్డారు. ఈ తాజా పెంపుతో విజయవాడ పరిసర ప్రాంత ప్రజలపై ఏడాదికి రూ.36 కోట్ల భారం పడుతుందని సంవత్సరంలో మూడుసార్లు పెంచడం వల్ల మొత్తం రూ.100 కోట్ల భారం సామాన్యులపై పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు పాలను కూడా అందుబాటులో లేకుండా చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

1,50,000 మంది రైతుల భాగస్వామ్యంతో నడుస్తున్న కృష్ణా సహకార సంఘాన్ని కబ్జా చేసేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర పన్నారని బాబురావు ఆరోపించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చైర్మన్‌పై ఒత్తిడి తెచ్చి బలవంతంగా రాజీనామా చేయించడం అమానుషమని విమర్శించారు. గత ప్రభుత్వం అమూల్ పేరుతో సహకార రంగాన్ని దెబ్బతీస్తే ప్రస్తుత ప్రభుత్వం హెరిటేజ్, తమ స్వప్రయోజనాల కోసం నిబంధనలను గాలికి వదిలేస్తోందని దుయ్యబట్టారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నేతలు డి. కాశీనాథ్, బోయి సత్యబాబు, బి. రమణారావు, పి. కృష్ణ, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాల ప్యాకెట్లతో నిరసన తెలిపారు.

## బోగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి



ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ ఆగష్టు 09: ప్రముఖ సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బోగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం పరిసరాల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా సందడి చేస్తూ ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ లో ఈతలు కొడుతూ కేరింతలు కొట్టారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సెల్ఫీలు,ఫోటోలు దిగుతూ ఆనందంగా గడిపారు. పర్యాటకుల రాకతో బోగత జలపాతం పరిసర ప్రాంతం సందడిగా మారింది.చాలా మంది బోగత జలపాతం పర్యాటక ప్రాంతంగా సందర్శించటంలో ప్రముఖ స్థానం ఇస్తున్నారు.

## డ్రగ్స్ నివారణకు కొత్త వ్యూహాలు

### : డి జి పి సీవీ ఆనంద్

- **వరంగల్ పర్యటనలో డిజిపి.. యాదిలో మొదటి పోస్టింగ్**
- **నూతన కమిషనరేట్ భవనము నిర్మాణం పరిశీలన**
- **సోమవారం ములుగు జిల్లాలో పర్యటన**



ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ ఆగష్టు 09: తెలంగాణలో నక్సలిజం దాదాపు పూర్తిగా అంతరించిందని నక్సల్స్ చేతిలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని వరంగల్ పర్యటనకు వచ్చిన డిజిపి సివి ఆనంద్ చెప్పారు.లివరంగల్ నుంచే తన పోలీస్ ప్రస్థానం ప్రారంభమైందని ట్రైనీ ఐపీఎస్ గా ఇక్కడ నుండే కెరీర్ మొదలు పెట్టానని అప్పట్లో నక్సల్స్ ప్రభావం తీవ్రంగా ఉండేదన్నారు. 2010 తర్వాత రాష్ట్రంలో మావోయిజం తగ్గుముఖం పట్టిందని కీలక క్యాడర్ అంతా లొంగిపోయిందని పేర్కొన్నారు. మావోయిస్టులు బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆప్ రూపొందించామని తెలిపారు. ఎక్స్‌గ్రేషియా విషయంలో ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు.అలాగే ఈగల్ సైబర్ సెక్యూరిటీపై సమీక్షిస్తున్నట్లు చెప్పారు రోడ్డు, ఫుడ్ సేఫ్టీ కోసం టి- సేఫ్ యాప్ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ప్రధాన సమస్య మాదకద్రవ్యాలు అని వెల్లడించారు. డ్రగ్స్ నివారణకు కొత్త వ్యూహాలు అమలు చేస్తామన్నారు. వరంగల్ లో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ కమిషనరేట్ నూతన భవనాన్ని డీజీపీ పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని వరంగల్ పోలీస్ కమిషనర్ యన్ శ్వేత వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సౌకర్యాలు కల్పించాలని ఆధునిక సాంకేతికత, నిఘా వ్యవస్థలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని డిజిపి అధికారులను ఆదేశించారు. ఇది ఇలా ఉండగా డిజిపి సోమవారం ములుగు జిల్లాల్లో పర్యటించనున్నారు. తెలంగాణ–చత్తీస్గడ్ సరిహద్దులోని కర్రెగుట్టలు, చల్వాయి లోని టీజీఎస్పి క్షేత్ర బెటాలియన్ ను సందర్శిస్తారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దళ సభ్యులకు ములుగులో సమావేశం అవుతారు జనజీవన స్రవంతిలో కలసిన జిల్లాకు చెందిన తక్కల్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ తో మాట్లాడనున్నట్లు పోలీసు వర్గాల సమాచారం.

## పూర్వ విద్యార్థుల సేవాభావం అభినందనీయం

### -జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు తమ మాతృసంస్థపై ఉన్న మమకారంతో విద్యార్థులు, రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరా లను విరాళంగా అందించిన కార్యక్రమానికి శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ తాము విద్యనభ్యసించిన మాతృసంస్థకు పూర్వ విద్యార్థులు తిరిగి సేవలం దించడం అభినందనీయమని అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా వైద్య పరికరాలను విరాళంగా అందించడం ద్వారా పూర్వ విద్యార్థులు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారని కొనియాడారు. అత్యాధునిక పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం వల్ల వైద్య సేవలను మరింత ఆధునీకీకరించడంతో పాటు, రోగులకు వేగవంతమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ముఖ్యంగా రక్త మార్పిడి సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వల్ల రోగులకు సురక్షితమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు మొత్తం రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశారు. వీటి ద్వారా ఆసుపత్రిలో వైద్య సేవల సామర్థ్యం మరింత పెరగడంతో పాటు, రోగులకు అవసరమైన సమయంలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.వై. రావులు మాట్లాడుతూ విరాళంగా అందించిన పరికరాల్లో 'స్టెరైల్ కనెక్టింగ్ డివైజ్' అత్యంత ప్రాధాన్యత కలిగినదని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు అవసరమయ్యే కొద్దిపాటి రక్తాన్ని కూడా తక్కువ మోతాదులో, అత్యంత సురక్షితమైన పద్ధతిలో సరఫరా చేసేందుకు ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి పరికరాలు చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఈ పరికరం అందుబాటులోకి రావడం వల్ల చిన్నారులతో పాటు అవసరమైన ఇతర రోగులకు కూడా రక్త మార్పిడి సేవలను మరింత సురక్షితంగా అందించే దుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఆధునిక జెల్ టెక్నాలజీ ఆధారిత పరికరాల వినియోగం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మంది రోగులకు రక్త సంబంధిత సేవలు అందించేందుకు వీలవుతుందని అధికారులు తెలిపారు. రక్త అనుకూలత పరీక్షలు, రక్త మార్పిడి ప్రక్రియలో ఈ సాంకేతికత కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గత ఆరు నెలల కాలంలో సుమారు 6 వేల మంది రోగులకు రక్తం సరఫరా చేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల సహకారంతో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాలు ఆసుపత్రిలోని వైద్య సేవల నాణ్యతను మరింత పెంచేందుకు దోహదపడతాయని తెలిపారు

## రైజ్ రెక్కలతో మహిళల విజయ విహంగం

### -జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, మహిళల్లో దాగిఉన్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి, వారిని పారిశ్రావి ుకవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా రైజ్ కేంద్రం విశేషంగా కృషిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ అవకాశాలను అందిస్తూ రైజ్ కేంద్రం ఒక ప్రత్యేక గ్రామీణ ఇంక్యుబేషన్ సెంటర్‌గా ఎదుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో జరిగిన సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌పోను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రైజ్ కేంద్రం చేయూతతో ఏర్పాటుచేసిన పారిశ్రామిక యూనిట్ల ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన 27 స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో ముఖ్యమంత్రి దార్శనికత అయిన ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త మైలురాయిని చేరుకునేందుకు రైజ్ కేంద్రం కీలక ముందడుగా నిలుస్తోందన్నారు. ఈ కేంద్రంలో ప్రతిరోజూ శిక్షణ కార్యక్రమాలతో పాటు ప్రతి శనివారం వర్క్‌షాప్‌లు, ఎప్పటికప్పుడు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా ఇప్పటికే 30 వర్క్‌షాప్‌లు నిర్వహించామని, 5000 మంది మహిళలకు చేరువయ్యామని తెలిపారు. వీరిలో ఇప్పటికే చాలామంది పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటుచేసి విజయవంతంగా ముందుకెళ్తున్నారన్నారు. రైజ్ కేంద్రం ద్వారా మహిళలు తమలోని నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకునేలా ప్రోత్సహించడంతో పాటు, చిన్నస్థాయి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. మైక్రో, మినీ ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటివాటిలో స్వయం ఉపాధి నుంచి పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న మహిళల విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా రైజ్ కేంద్రం దోహదపడుతోందని అన్నారు. స్థానికంగా లభించే వనరులు, నైపుణ్యాలు, మహిళల సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్‌పై దృష్టిసారించేలా చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు, మార్కెట్ అవకాశాలతో అనుసంధానం కల్పిస్తూ వారి యూనిట్లు స్థిరంగా అభివృద్ధి చెందేలా రైజ్ తోడ్పాటునందిస్తున్నట్లు వివరించారు.

సమాజంలో పారిశ్రామికరంగంలో విజయవంతంగా ముందుకెళ్తున్న ఎందరో మహిళలు మార్గదర్శులుగా వ్యవహరిస్తూ పీ4 స్ఫూర్తిని చాటిచెబుతున్నారని, రిసోర్స్ పర్సన్స్‌గా సేవలందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీపీఎం ఎ.శ్రీనివాసరావు, రైజ్ మేనేజర్ బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## చక్కెర కర్మాగారాల లిక్విడేషన్ చట్టవిరుద్ధం

విజయవాడ, రైతుల ఆమోదం లేకుండా సహకార చక్కెర కర్మాగారాల లిక్విడేషన్ చట్టవిరుద్ధం, అప్రజాస్వామికంసహకార సంస్థల ఆస్తులు రైతుల సమిష్టి ఆస్తులు -- వాటిని బదిలీ చేసే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదురైతుల హక్కులను కాలరాసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి,
లేకుంటే రైతాంగంతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతాంపి.జమలయ్య, ఎ.కాటమయ్య హెచ్చరించారు. రాష్ట్రంలోని సహకార రంగ చక్కెర కర్మాగారాలను రైతుల అభిప్రాయాలను, షేర్‌హోల్డర్ల ఆమోదాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లిక్విడేషన్ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమైందని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ. కాటమయ్య, ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య తీవ్రంగా ఖండించారు.
అనకాపల్లి జిల్లాలోని పాండవపురం, ఏటికొప్పాక, విజయనగరం జిల్లాలోని భీమసింగి సహకార చక్కెర కర్మాగారాలను లిక్విడేషన్ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సహకార సూత్రాలకు, రైతుల హక్కులకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. సహకార రంగ సంస్థలు ప్రభుత్వ ఆస్తులు కావని, వాటిలో రైతులు షేర్లు కొనుగోలు చేసి తమ పెట్టుబడులతోనూ, శ్రమతో నిర్మించుకున్న రైతుల సమిష్టి ఆస్తులని వారు స్పష్టం చేశారు. సహకార సంస్థలకు ప్రభుత్వం యజమాని కాదని, వాటి భవిష్యత్తుపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతుల అనుమతి లేకుండా లిక్విడేషన్ ఎలా చేస్తారు? వేలాది మంది రైతులు షేర్లు కొనుగోలు చేసి పెట్టుబడులు పెట్టడంతో పాటు, తమ శ్రమతో అభివృద్ధి చేసిన ఈ చక్కెర కర్మాగారాలను షేర్‌హోల్డర్లైన రైతులతో సంప్రదించకుండా మూసివేయడం, లిక్విడేషన్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ధ్వజమెత్తారు. సహకార సంస్థల విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే ముందు సంబంధిత సభ్యులు, షేర్‌హోల్డర్ల అభిప్రాయాలను తీసుకోవడం, చట్టబద్ధమైన ప్రక్రియను పాటించడం అవసరమని తెలిపారు. రైతుల హక్కులను పక్కనపెట్టి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సహకార వ్యవస్థ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని విమర్శించారు. చక్కెర కర్మాగారాలకు చెందిన విలువైన భూములను ఏపీఐఐసీకి బదిలీ చేసి, పారిశ్రామికవేత్తలకు తక్కువ ధరలకు కట్టబెట్టే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటున్నదనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయని వారు తెలిపారు. సహకార సంస్థల పేరుతో రైతులు సమకూర్చుకున్న విలువైన భూములు, ఆస్తులను ప్రభుత్వ ఆస్తులుగా చూపించి ఇతర సంస్థలకు బదిలీ చేయడం తగదన్నారు. రైతుల సమిష్టి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు, పారిశ్రామికవేత్తలకు అప్పగించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం పనిచేస్తుందా? లేక రైతులు నిర్మించుకున్న సహకార సంస్థల ఆస్తులను పారిశ్రామికవేత్తలకు అప్పగించేందుకే పనిచేస్తుందా అని వారు ప్రశ్నించారు.సహకార చక్కెర కర్మాగారాలు కేవలం భవనాలు, భూములు మాత్రమే కాదని, వాటితో వేలాది మంది చెరకు రైతులు, కార్మికులు, ఉద్యోగులు, అనుబంధ వృత్తులపై ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. కర్మాగారాలను లిక్విడేషన్ చేయడం వల్ల రైతుల ఆర్థిక ప్రయోజనాలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూసివేత, లిక్విడేషన్ వైపు కాకుండా సహకార చక్కెర కర్మాగారాలను పునరుద్ధరించి, ఆధునీకరించి, రైతుల భాగస్వామ్యంతో లాభదాయకంగా నడిపేందుకు విధానపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సహకార సంస్థల ఆస్తుల బదిలీకి సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, సంబంధిత రైతులు, షేర్‌హోల్డర్లు, కార్మికులు, ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరారు. భవిష్యత్తులో సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసే విధంగా సమగ్ర విధానాన్ని రూపొందించాలని, రైతుల భాగస్వామ్యంతో సహకార సంస్థలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.



## మహేశ్‌బాబు పుట్టినరోజు వేళ శుభాకాంక్షల వెల్లువ.. చిరంజీవి, పవన్, వెంకటేష్ ప్రత్యేక విషెస్!

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో హోరెత్తుతోంది. ఆగస్టు 9న మహేశ్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు ప్రత్యేకంగా విషెస్ చెబుతున్నారు. మహేశ్ సినీ ప్రయాణం, సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ పలువురు స్టార్ హీరోలు ఆయనపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి మహేశ్‌బాబుకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఎదుగుదలను ఎన్నో ఏళ్లుగా చూస్తూ రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని చిరంజీవి పేర్కొన్నారు భారతీయ సినిమాలో అత్యంత ప్రేమాభిమానాలు పొందుతున్న ప్రముఖ నటుల్లో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని అన్నారు. భగవంతుడు ఎల్లప్పుడూ మహేశ్‌ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు చిరంజీవి తెలిపారు. మరోవైపు మహేశ్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతూ పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ కూడా ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబుకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, మరెన్నో విజయాలు దక్కాలని ఆకాంక్షించింది. ముఖ్యంగా మహేశ్‌బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

# ‘చెన్నై లవ్ స్టోరీ’ ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.

### కిరణ్ అబ్బవరం మూవీ స్ట్రీమింగ్ ఎక్కడ అంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ ‘చెన్నై లవ్ స్టోరీ’ థియేటర్లలో మంచి స్పందన అందుకుంది. జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. ‘బేబీ’ సినిమాతో సక్సెస్ అందుకున్న సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ‘చెన్నై లవ్ స్టోరీ’ ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది.

# ఆగష్టు బాక్సాఫీస్ జోరు..

### ప్రేక్షకులను కట్టిపడేస్తున్న చిత్రాలు!



ఆగష్టు తొలి వారం బాక్సాఫీస్ బరి రంజుగా మారింది. గడచిన జులై నెలలో ‘లెనిన్’, ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రాలు ప్రేక్షకులను థియేటర్ల బాట పట్టించడంలో విజయం సాధించగా, ఇప్పుడు ఆగష్టు మొదటి వారాన్ని టార్గెట్ చేస్తూ పలు క్రేజీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ లాంగ్ వీకెండ్ సంచలన ఫలితాలను నమోదు చేసేలా కనిపిస్తోంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన వినూత్న చిత్రం ‘కొరియన్ కనకరాజు’ ప్రీమియర్ షోల నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. కామెడీ టైమింగ్ మరియు భిన్నమైన కథాంశం ఆడియన్స్‌కు విపరీతంగా కనెక్ట్ కావడంతో థియేటర్ల వద్ద రద్దీ పెరిగి, కొత్త స్క్రీన్లను సైతం జతచేస్తున్నారు. క్రిటిక్స్ నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, మాస్ ఆడియన్స్ నుంచి మాత్రం సినిమాకు సాలిడ్ రెస్పాన్స్ లభిస్తోంది.

ఇదిలావుంటే.. తమిళ పరిశ్రమ నుంచి వచ్చిన మరో క్రేజీ చిత్రం లోకేష్ కనగరాజ్ డీసీ ఊహించని విధంగా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమాకు ఫస్ట్ షోతోనే సూపర్ హిట్ టాక్ వచ్చేసింది. ముఖ్యంగా ఈ చిత్రానికి వస్తున్న మౌత్ టాక్ బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తుండగా, సంగీత దర్శకుడు అందించిన నేపథ్య సంగీతం (దీ+వీ) సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు సినీ ప్రేమికులు చర్చించుకుంటున్నారు.

మరోవైపు దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రలో నటించిన ‘ఖజీూ’ (కింగ్ జాకీ క్వీన్) సినిమా సైతం డీసెంట్ టాక్‌తో ప్రయాణిస్తోంది. క్రైమ్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి పర్వాలేదనే స్పందన వస్తోంది. మొత్తానికి ఆగష్టు మొదటి వారం విడుదలైన ఈ విభిన్న చిత్రాల జోరు చూస్తుంటే, ఈ వీకెండ్ బాక్సాఫీస్ వద్ద అసలు సిసలైన పండగ వాతావరణం నెలకొందని చెప్పవచ్చు.


# అనిల్ రావిపూడి క్రేజీ ప్లాన్..



టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి హీరో కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ మల్టీస్టారర్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఇండస్ట్రీలో ఓ ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. గతంలో ‘గుంటూరు కారం’ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన హౌస్ సెట్‌లో వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై ఓ అదిరిపోయే సాంగ్‌ను అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. మ్యూజిక్ సెన్సేషన్ జీవీ ప్రకాష్ కుమార్ ఈ మాస్ నంబర్‌కు అదిరిపోయే ట్యూన్ అందించారు.

ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను వచ్చే సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ చిత్రానికి ‘జనవరి 13 విడుదల’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్ క్రియేషన్స్, సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తుండగా, జీ స్టూడియోస్ కూడా భాగస్వామ్యం వహిస్తోంది. నవంబర్ నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని దర్శకుడు అనిల్ రావిపూడి ప్లాన్ చేశారు.

# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్.. ట్రైలర్ వచ్చేది ఆరోజే!




భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ‘మీర్జాపూర్’ ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం ‘మీర్జాపూర్: ది మూవీ’ (వీఱతీఓ్ఠుజాబతీ:ఎ్ష్రవ వీశీఙఱవ) కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురు-చూస్తున్నారు.కాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగష్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) . కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు ఈ ఫ్రాంచైజీ సిద్ధమైంది. ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4న కేవలం థియేటర్లలో మాత్రమే విడుదల కానుంది.